ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి
- రాకేశ్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

అడ్డగూడూరు, మే 21: ఈ నెల 27న జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం ఉన్న రాకేశ్‌రెడ్డిని పెద్దల సభకు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, నాయకులు పాశం విష్ణువర్ధన్, వెంపల్ల నర్సిరెడ్డి, బైరెడ్డి రాంరెడ్డి, నవిన్, చిత్తలూరి నరేశ్, బాలెంల అరవింద్, దాసరి బాలరాజు, గూడెపు పరమేశ్, గజ్జెల్లి రవి, గూడెపు నరేశ్, బాలెంల అయోధ్య, మందుల కిరణ్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు : తాసీల్దార్ కార్యాలయంలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సమస్యలపై ప్రశ్నించే వ్యక్తినే పెద్దల సభకు పంపాలి

మోత్కూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక అయిన బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని మోత్కూరు రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. ప్రజలు, నిరుద్యోగుల శ్రేయస్సు కోసం పని చేసే విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డి సరైన అభ్యర్థి అన్నారు. నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, నాయకులు కొండ సోంమల్లు, మర్రి అనిల్‌కుమార్, జంగ నరేశ్ పాల్గొన్నారు.

మోత్కూరులో పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న రైతుసేవా సహకార సంఘం చైర్మన్ అశోక్‌రెడ్డి, నాయకులు

రాకేశ్‌రెడ్డి గెలుపుకోసం కృషి చేయాలి

ఆలేరురూరల్ : ఖమ్మం,వరంగల్,నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు పరిదె సంతోష్ కోరారు. మంగళవారం మండలంలోని పటేల్‌గూడెంలో విలేకరులతో మాట్లాడారు. శాసనమండలిలో పట్టభద్రుల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా, వారి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయగల వ్యక్తినే గెలిపించాలని సూచించారు. రాకేశ్‌రెడ్డి గెలుపుకోసం బీఆర్ఎస్ నాయకులు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు గుర్రాల రమేశ్, కరికె మల్లేశ్, వెంటిక మధు, బండ జహంగీర్, రమేశ్ ఉన్నారు.

ఆలేరు రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు పరిదె సంతోశ్

లక్ష్మీనరసింహుడికి సుప్రభాత సేవ

యాదగిరిగుట్ట, మే 21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారికి మంగళవారం సుప్రభాత సేవోత్సవం వైభవంగా సాగింది. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. . స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయం చెంతనేగల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చన చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 47,74,123 ఆదాయం సమకూరిందని ఈఓ భాస్కర్ రావు తెలిపారు.

మాలధారుల దీక్ష విరమణ

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి మాలధారణ చేసిన భక్తులు మంగళవారం ఆలయంలో దీక్ష విరమించారు. యాదగిరిగుట్ట మండలంతో పాటు వివిధ మండలాలకు చెందిన 100మంది మాల ధరించి 45 రోజుల పాటు దీక్ష చేపట్టారు. అనంతరం ఇరుముడులతో స్వామివారిని దర్శించుకొని దీక్ష విరమించారు.

బ్రహ్మోత్సవ మండపం వద్ద భారీ ఎల్ ఈడీ స్క్రీన్

యాదగిరిగుట్ట, మే21: స్వామివారి నిత్య, ఆర్జిత పూజలు మాఢవీధుల్లో ఉన్న భక్తులకు స్పష్టంగా కనిపించే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. మంగళవారం భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను బ్రహ్మోత్సవ మండపం వద్ద ఏర్పాటు చేశారు. దీనిని ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు ప్రారంభించారు. స్వామివారి పూజా కైంకర్యాలను ఈ స్క్రీన్ ద్వారా వీక్షించవచ్చు.

ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్

ఉగ్రం- వీరం గ్రంథం ఆవిష్కరణ

యాదగిరిగుట్ట, మే21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి జయంత్యోత్సవాల సందర్భంగా ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ రచనల సంకలన గ్రంథం 'ఉగ్రం-వీరం' గ్రంథాన్ని మంగళవారం ఆలయ ఈఓ భాస్కర్‌రావు కొండపైన ఆవిష్కరించారు. అనంతరం భక్తులు, ఆలయ సిబ్బందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు రామాచారి, ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఈఈ దయాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

చేనేత కళాకారుల నైపుణ్యం అద్భుతం

- చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

భూదాన్‌పోచంపల్లి, మే 21: చేనేత కళాకారుల నైపుణ్యం అద్భుతం అని గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సతీమణి చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కొనియాడారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని చేనేత కళాకారుల ఇండ్లను ఆమె సందర్శించి వస్త్రాల తయారీని పరిశీలించారు. అనంతరం దుకాణాల్లో ఉన్న పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి కార్మికులను ప్రోత్సహించాలని కోరారు. ఆమె వెంట ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఝాన్సీ, రేష్మ, మాజీ వార్డ్ సభ్యురాలు కొంక లావణ్య, లక్ష్మీనారాయణ ఉన్నారు.

చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న బొంతు శ్రీదేవి

రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అరకొర వైద్యసేవలే

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్

భువనగిరి అర్బన్, మే 21: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానాలో రోగులకు అరకొర వైద్యం అందుతున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ అన్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి అనేక మంది వైద్యం కోసం భువనగిరి దవాఖానకు వస్తున్నారని, వారికి మెరుగైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులకు ఏదైనా అత్యవసర చికిత్స అవసరమైతే హైదరాబాద్‌కు పంపిస్తున్నారని, దాంతో పేదలపై ఆర్థిక భారం పడుతున్నదని పేర్కొన్నారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉందని, 20 డాక్టర్ పోస్టులు, రెండు లాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వెంటనే ఆయా పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు కూడా అవకాశం కల్పించాలని అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బట్టుపల్లి అనూరాధ, జిల్లా నాయకులు దాసరి పాండు, మాయ కృష్ణ, దయ్యాల నరసింహ, గడ్డం వెంకటేశ్, ఈర్లపల్లి ముత్యాలు, చింతల శివ, ఓవల్దాస్ అంజయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటగిరి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు షురూ

బొమ్మలరామారం, మే21 : మండలంలోని వెంకటాపురం గ్రామంలోని కొండపైన వెలిసిన వెంకటగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, కలశ పూజ, పంచామృత పూజ, అభిషేకం, ఆంజనేయ స్వామికి సింధూర అలంకరణ, ఆకుపూజ, ధ్వజస్తంభ, గరుడ పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 23న స్వామివారి కల్యాణం, ఊరేగింపు, పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ అల్లూరి ప్రభాకర్‌రెడ్డి, ఆలయ అనువంశిక పూజారి రమాకాంత శర్మ తెలిపారు.

వీధుల్లో మురుగు.. పట్టించుకునే వారు కరువు

ఆత్మకూరు(ఎం),మే 21 : మండల కేంద్రంలోని 11వ వార్డులోని వీధుల్లో మురుగు కాల్వల్లో చెత్త పేరుకు పోయి మురుగు నీరంత వీధుల్లో పారుతోంది. దాంతో ఆ వీధంతా దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 20 రోజుల నుంచి ఈ సమస్య ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

11వ వార్డులోని వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

చౌటుప్పల్, మే 21 : చౌటుప్పల్ పీఏసీఎస్ సీఈఓ వై. రమేశ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను సోమవారం డీసీఓ ప్రవీణ్‌కుమార్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డికి అందించారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కొంత మంది అడిషనల్ కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ అనంతరం సీఈఓను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట, మే 21: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాదువెల్లి గ్రామానికి చెందిన గోలి శ్రీనివాస్(36) సొంత పనిపై యాదగిరిగుట్టకు బైక్‌పై బయల్దేరాడు. సైదాపురం రోడ్డులోని కోహినూర్ వెంచర్ వద్దకు రాగానే ఎదురుగా బైక్‌పై వస్తున్న జిల్లా భరత్ వేగంగా ఢీకొట్టాడు. దాంతో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ జగన్

తాళం వేసే ఉంది.. ఇంట్లో నగలు మాయం

సంస్థాన్ నారాయణపురం, మే21 : తాళం వేసిన ఇంట్లోంచి బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైన ఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చిలువేరు వెంకులు, అంజమ్మ దంపతులు రెండు రోజుల క్రితం తమ బంధువులు చనిపోవడంతో ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లారు. వెళ్లే సమయంలో ఐదు తులాల బంగారం, 75 తులాల వెండి ఆభరణాలతో పాటు, రూ.2500 ఇంట్లో ఒక గిన్నె కింద భద్రపర్చి వెళ్లారు. అయితే వారు రెండు రోజులుగా బంధువుల ఇంటి నుంచి తమ ఇంటికి వస్తూ పోతూ ఉన్నారు. మంగళవారం ఉదయం గిన్నే తిసి చూడగా రూ.2500 మాత్రమే ఉన్నాయి. బంగారం, వెండి కనిపించలేదు. ఇంటికి వేసిన తాళం వేసినట్లే ఉండగానే బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.

అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ నాయకుల డిమాండ్


ఆత్మకూర్(ఎం) : సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ దశరథగౌడ్

మోత్కూరు, మే 21 : రైతులు పండించే అన్ని రకాల ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించాలని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు వరి ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, గద్దెనెక్కాక కేవలం సన్న రకానికి మాత్రమే బోనస్ చెల్లిస్తామనడం సరి కాదన్నారు. రాష్ట్రంలో ఎక్కువ మంది రైతులు మన వాతావరణాన్ని తట్టుకునే దొడ్డు రకం ధాన్యాన్ని పండిస్తారని తెలిపారు. అధికారం కోసం రైతులను నమ్మించి ఇప్పుడు మోసం చేయడం సిగ్గు చేటన్నారు. వానకాలం సీజన్ ప్రారంభం కావస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కొండ సోంమల్లు, పానుగల విష్ణుమూర్తిగౌడ్, గజ్జి మల్లేశ్ పాల్గొన్నారు.

బోనస్ వెంటనే చెల్లించాలి

ఆత్మకూరు(ఎం) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు క్వింటాకు రూ.5 వందల చొప్పున బోనస్ చెల్లించాలని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సర్వేపల్లిలో నిర్వహించిన రైతుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని నేటి వరకు కూడా పూర్తిగా కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ బలపర్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచులు సుంకిశాల ఎల్లయ్య, దంతూరి వెంకటేశం, యాదగిరి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మేడి వెంకటేశ్, నాయకులు రవీందర్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి లింగారెడ్డి

తుర్కపల్లి, మే 21: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జిల్లా మొబిలైజేషన్ అధికారి పెసరు లింగారెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పాఠశాలల అమ్మ ఆదర్శకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని పాఠశాలల్లోని పనులను నాణ్యతతో పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ జాన్సీలక్ష్మీబాయి, ఎంఈఓ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లింగారెడ్డి

రైతు సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాసానికి ప్రతిపాదన

మోత్కూరు, మే 21 : మోత్కూరు రైతు సేవా, సహకార సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానికి సంఘానికి చెందిన 9మంది సభ్యులు ప్రతిపాదన చేశారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్‌కు చెందిన డైరెక్టర్లు గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్ రావు, జిట్ట లక్ష్మయ్య, కారుపోతుల ముత్తయ్య, బుషిపాక సుజాత, తాళ్లపెల్లి స్వామి, బండ పద్మ, పేలపుడి వెంకటేశ్వర్లు మంగళవారం డీసీఓను కలిసి ప్రతిపాదన పత్రాన్ని అందించారు. అంతకు ముందు సంఘంలోని డైరెక్టర్లు బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్‌రావు వరుసగా ఐదు సార్లు సంఘం సర్వసభ్య సమావేశాలకు హాజరు కాలేదు. దాంతో పాలకవర్గం తీర్మానం మేరకు వారిపై అనర్హత వేటు వేసిన సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి తీర్మాన పత్రాలను డీసీఓకు అందించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సంఘం పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయగా 9 మంది సభ్యులు హాజరు కాకుండా నేరుగా డీసీఓ వద్దకు వెళ్లి అవిశ్వాస పత్రం అందించారు.

అవిశ్వాస ప్రతిపాదన పత్రాన్ని డీసీఓకు అందిస్తున్న సభ్యులు

రాజకీయ కక్షతోనే అవిశ్వాస ప్రతిపాదన : చైర్మన్ అశోక్‌రెడ్డి

సహకార చట్టం ప్రకారం సమావేశాలకు హాజరు కాకుండా ఉన్న ఇద్దరు డైరెక్టర్లపై పాలకవర్గం వేటు వేయడంతో నాపై రాజకీయ కక్షతోనే అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదన చేశారు. నా పదవీ కాలంలో అవినీతికి ఆస్కారం లేకుండా పాలన సాగిస్తున్నాం. సంఘం పాలకవర్గ తీర్మానం మేరకు షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నాం. ఇప్పటి వరకు రూ.42లక్షల పనులు జరిగాయి, జరిగిన పనికి రూ.39 లక్షలను అధికారులే చెల్లించారు. రూ.50లక్షలు డ్రా చేసినట్లు కొంత మంది చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు.

25 సాయంత్రం నుంచి వైన్స్, బార్‌లు బంద్

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 21 : ఈ నెల 27న వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ నెల 25 సాయంత్రం 4 గంటల నుంచి జిల్లాలో అన్ని వైన్స్, బార్లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు బంద్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె. జెండగే మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఎక్సైజ్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సంఘం విధించిన నిబధనలను ఉల్లంఘిస్తే తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్ 1968, సెక్షన్ 20 (1) ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంస్థాన్‌నారాయణపురం, మే 21: సంస్థాన్‌నారాయణపురం, లింగవారిగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్లకు బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తగిలి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, దాంతో వాటిని తొలగించే పనులు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని వారు కోరారు.

మర్యాలలోని కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ జెండగే

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

బొమ్మలరామారం, మే 21 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే ఆదేశించారు. మండలంలోని మర్యాల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. లారీల ద్వారా ధాన్యం బస్తాల రవాణా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులతో మాట్లాడి కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, కేంద్రం నిర్వాహకుడు బాబు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చౌటుప్పల్, మే 21 : చౌటుప్పల్ పట్టణం బంగారిగడ్డ కాలనీకి చెందిన ఎండీ. చాంద్‌పాషా ఇటీవల మృతి చెందాడు. అతడి భార్య జరీనాబేగం సైతం అనారోగ్యం బారిన పడి దవాఖానలో చికిత్స పొందుతున్నది. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న చాంద్‌పాషా స్నేహితులు (చౌటుప్పల్ జడ్పీహైస్కూల్ 1992-93 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులు) మంగళవారం రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముత్యాల హన్మంతరెడ్డి, సుర్వి నర్సింహగౌడ్, గజం ఆనంద్, నర్రా రామలింగారెడ్డి, ఊడుగు వెంకటేశ్, ఎండీ ఎజాజ్‌పాషా, సుర్కంటి భుజంగరెడ్డి, వీరమళ్ల నారాయణ, చెరుకు మల్లేశం గౌడ్ పాల్గొన్నారు.

చాంద్‌పాషా కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

రవీందర్ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతికి పలువురి సంతాపం

రామన్నపేట, మే 21: రామన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం గణిత ఉపాధ్యాయుడిగా, హెచ్ఎంగా పని చేసి రిటైర్ అయిన గార్లపాటి రవీందర్ సోమవారం రాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవీందర్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎండీ. జమీరొద్దీన్, అయ్యాడపు నర్సిరెడ్డి, కొత్తపల్లి అబ్రహం, ఎండీ. నాసర్, సాల్వేరు అశోక్, మహేశ్వరం అశోక్, కిరణ్, గురుకు శివ, బట్టె సంతోష్, జాని, నరేందర్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

బొమ్మలరామారం, మే 21 : అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతుల ధాన్యం తడిసిందని, ఆ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం మండలాధ్యక్షుడు ఎనగళ్ల రాజప్ప డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు తాసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించడానికి సత్వర ఏర్పాట్లు చేయాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి అన్నమైన వెంకటేశం, రైతులు పాల్గొన్నారు.

తాసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు